క్లుప్తంగా

నెలాఖరు లోపు ఈ కేవైసీ చేయించుకోవాలి

ముప్పాళ్ల: మండలంలోని రేషన్ కార్డుదారులందరు ఈ నెల 31వ తేదీ లోపు ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దారు ఎమ్.భవానీశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3,375 రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ పెండింగ్‌లో ఉందని, నెలాఖరులోపు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రంజాన్ తోఫా బ్రోచర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలో ఈ నెల 27న పట్టణ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేయనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ బ్రోచర్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, యెల్లినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెదకరిముల్లా, సయ్యద్ రాంబోబుడే, దూదేకే, షేక్ మస్తాన్‌వలి, వడ్డెంపూడి పవన్ కుమార్, సయ్యద్ గౌస్, ఎస్కే ఎమ్‌డీ గౌస్, ఉమర్, కార్తీక్ ఉన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



అమరావతి: బ్రిటీష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన మహనీయుడు సర్దార్ భగత్‌సింగ్ అని మండల సీఐటీయూ కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమకారులపై అణచివేతను ఆపాలని ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదించిన ధైర్యశాలి భగత్‌సింగ్ అన్నారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుబ్బారావు, ఎస్కే రఫీ, సీహెచ్ నరహరి వెంకటేశ్వరరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన మందిరాలకు ఎల్‌ఈడీ గడియారాలు అందజేత



పెదకూరపాడు: ముస్లిం సోదరులకు జమాత్ వేళలు తెలిసేందుకు పెదకూరపాడు గ్రామానికి చెందిన మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత జవ్వాది సతీష్‌కుమార్ ఆదివారం రూ.1.50 లక్షల విలువ కలిగిన ఎల్‌ఈడీ గడియారాలను పెదకూరపాడులోని ఆరు మసీదులు (ప్రార్థన మందిరాలు)కు అందజేశారు. అసర్, మగ్రిబ్, ఇషా, జుమ్మ సమయాలు తెలిసే విధంగా రూపొందించిన ఎల్‌ఈడీ గడియారాలను అందించడం అభినందనీయమని మత పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మన్నవ నాని, నాదెండ్ల వెంకటేశ్వర్లు, గుంటుపల్లి కోటేశ్వరరావు, జవ్వాది రామకోటేశ్వరరావు, తుమాటి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

కారెంపూడి: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ జరుగుతుందని తహసీల్దారు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్, జిల్లా కేంద్రాలకు అర్జీదారులు వెళ్లి అర్జీలు ఇస్తున్నారని అలా ఎవరూ వెళ్లవద్దని, అక్కడ అర్జీలిచ్చినా పరిష్కారానికి మళ్లీ ఇక్కడకే వస్తాయని ఆయన తెలిపారు. ఇక్కడ అర్జీ ఇచ్చిన వెంటనే రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందని సమస్యలను ఖచ్చితంగా పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

మాచర్ల : స్వాతంత్ర్య సమరయోధుడు, మహనీయుడు భగత్‌సింగ్ 94వ వర్ధంతి ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఏఐవైఎఫ్ నియోజక వర్గ అధ్యక్షులు నర్రా రంగా స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన పోరాటాల గురించి వివరించారు. సీపీఐ టౌన్ కార్యదర్శి మిద్దెపోగు బాబురావుతో పాటు ఏఐవైఎఫ్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

మహిళలకు అక్షరాస్యతపై పరీక్షలు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో ఉల్లాస్ వారి సౌజన్యంతో 39 పరీక్ష కేంద్రాల్లో 390 మంది మహిళలకు అక్షరాస్యతపై పరీక్షలు నిర్వహించినట్లు ఏపీఎం జి.వాసుబాబు ఆదివారం తెలిపారు. గత రెండు నెలల నుంచి నేర్చుకున్న అంశాలపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి సీసీ ఖాజావలీ, మేరి కుమారి, తదితరులు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

ఆఖరి మజిలీకి అవాంతరాలెన్నో..!



ముళ్ల కంచెలతో అధ్వానంగా ఉన్న ఎస్సీ కాలనీ శ్మశానవాటిక



చౌటపాపాయపాలెం గ్రామంలోని శ్మశానవాటిక

అంత్యక్రియలకూ తప్పని తిప్పలు

- ముళ్ల కంచెలు, పెద్ద పెద్ద చెట్లతో నిండిపోయిన శ్మశానవాటికలు
- వర్షాకాలం వస్తే మరిన్ని కష్టాలు
- మంచినీటి చేతిపంపులు ఏర్పాటు చేయాలని వినతి
- అభివృద్ధి చేయాలని కోరినా పట్టించుకోని అధికారులు

రాజుపాలెం: చనిపోయిన వారికి అంత్యక్రియలు చేయడానికి గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. శ్మశానవాటిక పూర్తిగా ముళ్ల, కంప చెట్లతో నిండి పోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్లే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మరింత ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలంలో శ్మశానవాటిక నీటితో మునిగి ఉండడంతో అంత్యక్రియలు చేయలేని పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఎస్సీ కాలనీ వాసులకు కేటాయించిన శ్మశాన వాటికలో ముళ్ల కంచెలు, పెద్ద పెద్ద చెట్లు అల్లుకుపోవడంతో మృతదేహాన్ని పూడ్చాలంటే ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికలోకి వెళ్లాలంటే భయమేస్తుందని అంటున్నారు కాలనీ వాసులు.

మెరక తోలి అభివృద్ధి చేయాలి

మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామస్తుల దీన గాథ ఇది. గ్రామానికి సమీపంలో 1.50 ఎకరాల స్థలంలో శ్మశానవాటిక కలదు. శ్మశానం చుట్టూ వరి పొలాలు ఉండడం చేత రెండడుగులు గుంత తీస్తేనే నీరు ఊరుతూ ఉంటుంది. వర్షాకాలం శ్మశాన వాటిక వర్షం నీటితో నిండి ఉంటుంది. ఆ కాలంలో చనిపోయిన వ్యక్తికి కర్మకాండలు చేయుటం చాలా కష్టంగా ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పూడ్చి పెట్టిన సమాధులన్నీ కొట్టుకుపోతూ ఉంటాయి. బంధువులకు సమాధుల ఆనవాలు కూడా కనిపించవు. పూడ్చిన చోటే మరలా పూడ్చాల్సి వస్తుంది. శ్మశానవాటిక ముళ్ల కంచెలు, పెద్ద పెద్ద ముళ్ల చెట్లతో నిండి ఉండడం వలన అంత్యక్రియలు చేయడానికి చాలా కష్టంగా ఉంటోందని అంటున్నారు. గ్రామంలో సుమారు 400 ఇళ్లు, 2,500 మంది జనాభాకు గాను 1,100 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికను అభివృద్ధి చేసి మెరక తోలాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. దీనితో పాటు శ్మశాన వాటికలో మంచినీటి చేతి పంపులను కూడా ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

ముళ్ల కంచెలతో ఎస్సీ శ్మశానవాటిక

మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు 20 సెంట్ల స్థలంలో శ్మశాన వాటిక కేటాయించారు. కాలనీలో సుమారు 65 ఇళ్లు ఉన్నాయి. వీరికి కేటాయించిన శ్మశానవాటిక పూర్తిగా ముళ్ల కంచెలతో నిండి ఉంది. శ్మశాన వాటికలో పెద్ద పెద్ద ముళ్ల చెట్లు పెరగడంతో లోపలికి వెళ్లాలంటే భయం వేస్తుందని కాలనీ వాసులు చెబుతున్నారు. అంత్యక్రియలు జరిగిన చోటే మరలా అంత్యక్రియలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

అంత్యక్రియలు చేయుటకు ఇబ్బందులు



గ్రామస్తులకు కేటాయించిన శ్మశానవాటిక లో లెవల్‌లో ఉండడంతో వర్షాకాలం నీటితో నిండి ఉండడమే గాక పూడ్చిన సమాధులన్నీ కొట్టుకుపోతున్నాయి. సమాధుల ఆనవాలు కూడా బంధువులు గుర్తించలేకపోతున్నారు. పెద్ద పెద్ద ముళ్ల కంచెలతో నిండి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రావెల్ తోలి మెరక ఏర్పాటు చేయాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ముళ్ల చెట్లను తొలగించాలని కోరుతున్నా.

– కడియం నరసింహారావు, మాజీ సర్పంచ్, చౌటపాపాయపాలెం

అనేక సార్లు అధికారులను కోరాం



ఎస్సీ కాలనీ శ్మశానవాటిక ముళ్ల కంచెలతో నిండి ఉంది. లోపలకు వెళ్లాలంటే భయమేస్తుంది. పూడ్చిన చోటనే పూడ్చాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్ల కంచెలను తొలగించి అభివృద్ధి చేయాలని కోరుతున్నా. మంచి నీటి కోసం శ్మశానవాటికలో చేతి పంపులను ఏర్పాటు చేయాలి.

– కోటా అంద్రియ్య, కాలనీ వాసి, చౌటపాపాయపాలెం

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని పణిదం సొసైటీ ఎదురు సంఘ సేవకుడు గంజి వీరాస్వామి ఆధ్వర్యంలో కీర్తిశేషులు గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం కుమారుడు గుండవరపు అనిల్ కుమార్ ధర్మపత్ని జయశ్రీ, కుమార్తె ప్రణవి, కుమారుడు అభిరామ్‌ల ఆర్థిక సహాయంతో 20 మంది నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడిన పృటికీ అనిల్‌కుమార్ దంపతులు ఈ ప్రాంతంలో వారి బంధువులు గంగూరి కళ్యాణ్ ధర్మపత్ని శ్రీవిద్య ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా గుండవరపు వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పణిదం సొసైటీ అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, సంఘ సేవకుడు గజ్జి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ పేరు మీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన కృష్ణమాదిగ

సత్తెనపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మంద కృష్ణమాదిగ అని మహాజన దళిత సమితి సీనియర్ నాయకుడు పెద్దింటి నాగేశ్వరరావు అన్నారు. మహాజన దళిత సమితి ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పట్టణంలోని అమరావతి బస్టాప్ సెంటర్‌లో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెద్దింటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభలు ఆమోదించడంలో కీలక పాత్ర పోషించిన మంద కృష్ణ మాదిగ గొప్పతనాన్ని కొనియాడారు. 30 సంవత్సరాలుగా వర్గీకరణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచిన మహనీయుడని, మాదిగలకు సమాజంలో గౌరవం దక్కేలా చేసిన వ్యక్తి కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీలలో అన్ని వర్గాలకు న్యాయం చేసి మాదిగల మహాత్ముడిగా మంద కృష్ణ మాదిగ మిగిలాడన్నారు. ముందుగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మహాజన దళిత సమితి యువ నాయకులు ముదిగొండ ఈశ్వర్, చిలుక రమణయ్య, బందారు రవి, రాష్ట్ర అధ్యక్షుడు దీపాల పరంధామయ్య, నాయకులు బొడ్డు కోటి, కందుల బాబురావు, సిద్దెల మోహన్ రావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మహాజన దళిత సమితి సీనియర్ నాయకుడు పెద్దింటి నాగేశ్వరరావు

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటా



సోషల్ మీడియా కార్యకర్తలతో మాట్లాడుతున్న గజ్జల సుధీర్ భార్గవరెడ్డి



కేకు కట్ చేస్తున్న గజ్జల సుధీర్ భార్గవరెడ్డి

నరసరావుపేటలోని కార్యాలయంలో సోషల్ మీడియా కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో డాక్టర్ గజ్జల

నరసరావుపేట: సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పెద్దఎత్తున పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న సైనికులైన సోషల్ మీడియా కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబ శివారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

పట్టణంలోని తన కార్యాలయంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవరెడ్డి ఘనంగా నిర్వహించారు. భారీగా హాజరైన అభిమానుల మధ్య భారీ కేకును కట్ చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబశివారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



పంచాయితీ రహదారిలో ఆర్‌సీఎం పాఠశాల వద్ద ప్రమాదంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



అంబేడ్కర్ బొమ్మ రహదారిలో ప్రమాదంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నిత్యం వాహనాలతో, జనంతో కిటకిటలాడే ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు భయానక వాతవరణాన్ని సృష్టిస్తున్నాయి. పక్కపక్కనే నివాసాలు, నిత్యం జన సంచారం ఎక్కడ చూసినా వాహనాల రద్దీ, పొరపాటున ప్రమాదం చోటు చేసుకుంటే ప్రాణ నష్టంతో పాటు పెద్ద ఎత్తున ఆస్తినష్టం కూడా జరిగే అవకాశం ఉంది. పెదకూరపాడు ఎస్సీ కాలనీల్లో ప్రమాదకంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఆందోళనకు గురిచేస్తున్నాయి. భద్రతావలయం లేకుండా.. చేతికి అందే విధంగా ఇళ్ల మధ్యనే ఉండే విద్యుత్ నియంత్రికలతో.. ఎప్పుడే ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియన పరిస్థితి. రోడ్ల పక్కన, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు, ఇళ్ల మధ్యనే ఏర్పాటు చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ వాటిని కొంచెం ఎత్తుగానైనా లేదా వాటి చుట్టూ రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– పెదకూరపాడు

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య 23వ వార్షికోత్సవాలు ఆదివారం గ్రామస్తులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఆలయ పూజారి జిగురు శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు అభిషేకాలు, పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు స్వామి వారికి తెల్లవారుఝాము నుంచే మొక్కుబడులు చెల్లించుకుంటూ, అభిషేకాలు చేస్తూ నైవేద్యాలు సమర్పించుకున్నారు. శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల స్వామి వార్లకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిపారు. స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు జరిపారు.

దాడి ఘటనలో పరస్పర కేసులు నమోదు

పెదకూరపాడు: పొలం దారి విషయంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణపై ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిన్నమక్కెన గ్రామానికి చెందిన అంబటి గోపాలకృష్ణ, చేకూరి నాగార్జునలకు గత కొన్ని రోజులుగా పొలం దారి విషయమై వివాదం నెలకొంది. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీన ఘర్షణ చోటు చేసుకోవడంతో అంబటి గోపాలకృష్ణపై చేకూరి నాగార్జున, గుంటుపల్లి శివాంజనేయులు, చేకూరి శేషమ్మలు దాడి చేయగా తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అంబటి గోపాలకృష్ణ తమపై అకారణంగా దాడి చేసి దుర్భాషలాడాడంటూ గుంటుపల్లి తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

112 మందికి కంటి వైద్య పరీక్షలు



అచ్చంపేట: లీగల్ అవేర్‌నెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని తాడువాయిలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్, దూళిపాళ్ల వారిచే ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 43 మందికి కంటి అద్దాలకు, 35 మందికి కాంటాక్ట్ లెన్స్ కోసం రిఫర్ చేశారు. ఈ సందర్భంగా లీగల్ అవేర్‌నెస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి రెవ.ఫాదర్ పుట్టి అంథోనిరాజు మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటే అన్ని ఇంద్రియాలలో కళ్లు చాలా ముఖ్యమైనవన్నారు. వాటిని కాపాడుకునేందుకు వైద్యుల సూచనలు తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు ఎక్కిరాల మురళి, సలికేటి సంహారాయలు, వైద్య సిబ్బంది రత్నకుమార్, మున్నార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిచనున్నట్లు భగవాన్ సేవా సమితి కన్వీనర్ గర్నె నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం సాయిబాబా మందిరంలో జరుగుతుందన్నారు.

నేడు కొత్తపల్లిలో బ్రహ్మం గారి తిరునాళ్ల



బ్రహ్మం గారు, గోవిందమ్మ

మాచర్ల రూరల్: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల 46వ కల్యాణ మహోత్సవం సోమవారం కొత్తపల్లి గ్రామంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఫౌండర్ అల్లం కోటిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించి స్వామి వారిని పురవీధుల్లో ఊరేగింపులో మహిళలతో కోలాట ప్రదర్శన, బాణాసంచాల మధ్య మేళతాళాలతో ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ పూజారి శ్రీనివాసాచారి నేతృత్వంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారం

రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిసెట్టి హనుమంతరావు

దొడ్లేరు(క్రోసూరు): సాగర్ కాలువకు నీరు విడుదల కోసం రైతాంగం జరిపిన పోరాట ఫలితంగా అధికారులు కాలువకు నీళ్ల విడుదల చేయటం జరిగిందని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిసెట్టి హనుమంతరావు అన్నారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఆదివారం సాగర్ కాల్వ కింద పంటలని రైతు సంఘం నాయకులు పరిశీలించారు. హనుమంతరావు మాట్లాడుతూ సాగర్ కెనాల్‌లోని చింతపల్లి మేజర్ కాల్వకు సాగు నీరు విడుదల చేయాలని మూడు రోజుల క్రితం దొడ్లేరులో రైతు సంఘం ఆధ్వర్యంలో చేసిన పోరాటం వలన అధికారులు నీటిని విడుదల చేయడం జరిగిందని, దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చింతపల్లి మేజర్‌కు కేటాయించబడిన నీటి సామర్థ్యం ప్రకారం కింది స్థాయి అధికారుల పర్యవేక్షణతో కాలువ చివరి భూముల వరకు నీరందించే విధంగా పర్యవేక్షించాలని సాగర్ కెనాల్ ఇరిగేషన్ ఏఈ బండి శ్రీనివాసరావును ఫోనులో ఆయన కోరారు. రైతులు కూడా నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని సమన్వయంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. రైతు సంఘం ఆధ్వర్యంలో గతంలో దొడ్లేరు గ్రామంలో ఎన్నో రైతాంగ పోరాటాలు జరిగాయని, అందులో భాగంగానే ఇప్పుడు ఎండిపోతున్న పంటలకు సరైన సందర్భంలో నీటిని అందించే విషయంలో రైతులకు న్యాయం జరిగిందని అన్నారు. రైతులు పార్టీలకు అతీతంగా ఐక్య పోరాటాల వలన భవిష్యత్తులో ఎలాంటి సమస్యలైనా పరిష్కారం అవుతాయని, రైతు సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పడాల రాంకోటేశ్వరరావు, షేక్ మస్తాన్, యామర్తి రాజారావు, తోట శ్రీనివాసరావు, జిడుగు నరసింహారావు, ఆవుల లక్ష్మి రెడ్డి, కొడవటి అంద్రయ్య, సుఖమంచి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.



దొడ్లేరులో ఆయకట్టు పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు, స్థానిక రైతులు

అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని అరెస్టు చేయాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు



క్రోసూరు: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దాసు మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన మారుతున్నా అంబేడ్కర్ విగ్రహాలపై దాడుల చేస్తున్న వారిని కఠినంగా శిక్షించకపోవడం వలన ఇలాంటి ఘటనలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తే రాష్ట్రంలో మరొక చోట ఇలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడమంటే దేశంలోని ప్రజలందరినీ అవమానించడమేనని, ప్రభుత్వం వెంటనే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గార్లపాటి దాసు డిమాండ్ చేశారు.

ఎంపీపీగా స్వర్ణమ్మభాయ్ ఏకగ్రీవం అయ్యే అవకాశం



స్వర్ణమ్మభాయ్

అచ్చంపేట: ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ అధ్యక్షునితో కొనసాగించిన మండల పరిషత్ కార్యవర్గం అసలైన అధ్యక్షుని ఎన్నుకునే సమయం ఆసన్నమైంది. నూతన ఎంపీపీగా మాదిపాడు ఎంపీటీసీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గెలుపొందిన భూక్యా స్వర్ణమ్మభాయ్ ఏకగ్రీవం కావడం దాదాపు ఖరారైంది. ఈ నెల 27న ఎంపీపీగా పదవీ బాధ్యతలు స్వీకరణ ఖాయం కానుంది. వివరాలలోకి వెళితే అచ్చంపేట మండల పరిషత్‌కు 2021 సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగాయి. మండల పరిషత్ అధ్యక్ష పదవి ఎస్టీ మహిళకు రిజర్వు కాబడింది. మొత్తం 17 స్థానాలకు గాను 16 స్థానాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించగా, వేల్పూరు స్థానం ఒక్కటి మాత్రమే టీడీపీ పరమైంది. వీరిలో ఎస్టీ మహిళలు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారిలో తాడువాయి ఎంపీటీసీ స్థానం నుంచి గెలుపొందిన భూక్యా రజనీభాయ్, మాదిపాడు ఎంపీటీసీ స్థానం నుంచి గెలుపొందిన భూక్యా స్వర్ణమ్మభాయ్‌లు మాత్రమే ఉన్నారు. అధ్యక్ష పదవి ఎస్టీ మహిళకు రిజర్వు కావడంతో వీరిద్దరిలోనే ఒకరు ఎంపీపీ కావాల్సి ఉంది. ఇద్దరిలో కుదిరిన ఒప్పందం మేరకు భూక్యా రజనీభాయ్‌ని అధ్యక్ష పదవి వరించింది. అయితే ఆమె వ్యక్తిగత కారణాల వల్ల 2024 మార్చిలో అంటే అసెంబ్లీ ఎన్నికల ముందు అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో ఉపాధ్యక్షునిగా ఉన్న గంగసాని నరసింహారెడ్డి ఇప్పటివరకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. రాజ్యాంగం ప్రకారం నిర్దేశించిన విధంగా అధ్యక్ష పదవి ఎస్టీ మహిళ నిర్వహించవలసి ఉంది. ఇలాంటివి రాష్ట్రంలో మరికొన్ని ఉండటంతో స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 27న మండల పరిషత్ నూతన అధ్యక్షుని ఎన్నుకునేందుకు తేదీని ఖరారు చేసింది. ఇప్పుడు ఎంపీపీ పదవి ఎస్టీ మహిళకు కేటాయింపులో భాగంగా ఎస్టీ మహిళలుగా ఉన్న భూక్యా రజనీభాయి, భూక్యా స్వర్ణమ్మభాయ్ ఇద్దరిలో ఒక్కరికే అవకాశం ఉంది. వారిరువురి ఒప్పందం మేరకు మొదటి విడత రజనీభాయ్ ఎంపీపీ కాగా మలి విడతలో స్వర్ణమ్మభాయ్ ఎంపీపీ కావడం దాదాపు ఖాయమే.